క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత రోడ్డులో గల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ చావా లక్ష్మణ్ తెలిపారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్ పరిధిలోని వరదయ్యనగర్, ఓల్డ్ గ్యాస్ గోదాం ఏరియాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు గణిత ప్రతిభా పరీక్ష

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెం పాఠశాలలో శుక్రవారం (నేడు) మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో అన్నిపాఠశాలలు అర్హులని పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు చొప్పున మాత్రమే ఈ పరీక్ష రాయుటకు అనుమతించబడుతుందన్నారు. ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థులను జిల్లాస్థాయి పోటీ పరీక్షలో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని హెచ్‌ఎం తెలిపారు.

30లోగా ఆన్‌లైన్ నమోదుకు కసరత్తు

నేలకొండపల్లి: ఈ నెల 30లోగా సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆన్‌లైన్ నమోదును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ నమోదును గురువారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే వివరాల నమోదు పారదర్శకంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. మండలంలో 98.11 శాతం సర్వే పూర్తి అయిందని, ఆన్‌లైన్ నమోదుకు 40 మంది ఆపరేటర్లను నియమించామని, అవసరమైతే రాత్రింబవళ్లు చేయించి పని పూర్తిచేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీ.హెచ్.శివ, ఏఎస్‌ఓ స్వందన తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఖమ్మం బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే పేదలకు శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ ప్రజాపతి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు తెగుళ్ల వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి పాపారావు, రాధాకృష్ణ, ఖమ్మంపాటి రమేష్, చాతరాజ్‌పల్లి చంద్రశేఖర్, డాక్టర్ దరిపల్లి భాస్కరరావు, మొగిలిచర్ల వెంకట్, కొలిచాల చిరంజీవి, రాచర్ల రాజు, కొత్తపల్లి సర్వయ్య, శ్రీనివాస్, జీఆర్పీ ఎస్సై పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు లేఔట్లకు అనుమతి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన లేఔట్ కమిటీ సమావేశంలో ఏడు లేఔట్లకు అనుమతి జారీ చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో 22 లేఔట్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నీ సక్రమంగా ఉన్న ఏడింటికి అనుమతి ఇచ్చారు. మిగిలిన లే ఔట్లకు ఎన్‌ఓసీలు సమర్పిస్తే జిల్లా స్థాయి సమావేశంలో పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జలవనరులశాఖ అధికారుల పరిశీలన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్, ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు గురువారం పర్యటించారు. రూ.66 కోట్ల అంచనాలతో మంజూరైన మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదిత ప్రాంతాల్లో వారు పరిశీలించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే వారం రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తుండగా, ఇంజనీర్లకు సూచనలు చేశారు. డీఈ ఝాన్సీ, ఏఈలు కల్పన, శ్రీరాం చరణ్ పాల్గొన్నారు.

అతిగా మందులు వాడొద్దు

కామేపల్లి: రైతులు మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు అన్నారు. శుక్రవారం మండలంలో మిరప తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. మిరపలో తెల్ల దోమ, నల్లి పురుగులను నివారించుకోవాలని, వాటి నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అతిగా రసాయన క్రిమి సంహారక మందులను పిచికారీ చేయొద్దన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రోటి కపడా రొమాన్స్
వినోద	భైరతి రణగల్
సాయిరాం	మెకానిక్ రాకీ
ఆదిత్య	కంగువా
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	జీబ్రా

- ఖమ్మంగాంధీచౌక్



వేపకుంట్ల మినీ ట్యాంక్‌బండ్ ముఖద్వారం

మూణ్నాళ్ల ముచ్చటే..!

ఆహ్లాదం కోల్పోయిన మినీ ట్యాంక్‌బండ్

- ప్రారంభించిన ఏడాదిలోపే కంపమయం
- రూ.25 లక్షలతో అభివృద్ధి
- వేపకుంట్ల చెరువును తీర్చిదిద్దాలని వేడుకోలు

రఘునాథపాలెం: చెరువు కట్టలను మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి పరిచి స్థానికులకు పచ్చదనంతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి అందించాలని ప్రభుత్వం తలంచింది. ఈనేపథ్యాన మండలంలోని వేపకుంట్ల చెరువు కట్టను రూ.25 లక్షలతో అభివృద్ధి పరిచి బ్యూటిఫికేషన్ ప్రారంభించారు. కానీ ఏడాదిలోపే ఆనవాళ్లు లేకుండా కంపచెట్లు కమ్మేశాయి. కనీసం నడిచేందుకు వీలులేకుండా ఉందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు.

ఆఘమేఘాల మీద పనులు..

గతేడాది క్రితం సీడీఎఫ్, ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.25 లక్షలతో వేపకుంట్ల గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువుకట్టను అభివృద్ధి చేశారు. జలవనరుల శాఖ పర్యవేక్షణలో చేపట్టిన పని మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిందని చెప్పొచ్చు. గ్రామం వైపు ఉన్న చెరువుకట్టను వెడల్పు చేసి, రెండు వైపుల రక్షణ ఫెన్సింగ్ తీగను ఏర్పాటు చేశారు. కట్ట లోపల భాగంలో కొంతభాగం వాకింగ్ ట్రాక్‌గా, సగం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటించారు. ఆఘమేఘాల మీద అభివృద్ధి చేసి ఇప్పుడు వదిలేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



వాకింగ్ ట్రాక్‌ను కమ్మేసిన కంపచెట్లు

కంపచెట్లతో వాకింగ్ ట్రాక్..

కట్టపై సుమారు అర కిలోమీటర్ మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు అది కంపచెట్లతో నిండిపోయింది. పచ్చదనం జాడ లేదు. లైట్లు కూడా అరకొరగానే వెలుగులు అందిస్తున్నాయి. ఏడాదిలోనే రూ.లక్షల అభివృద్ధి అభాసుపాలైందని, ఇలాంటి పనులు చేయడం వల్ల ఎవరికి ఉపయోగం అని స్థానికులు మండి పడుతున్నారు. వాకింగ్ ట్యాక్‌పై పెరిగిన కంపచెట్లు తొలిగించడంతో పాటు కట్టకు ఇరువైపుల అడివి తలపించేలా పెరిగిన పిచ్చి చెట్లు, కంప చెట్లు, గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

రూ.లక్షలు ధార పోసారు తప్ప లక్ష్యం మాత్రం నెరవేరలేదని చెబుతున్నారు.

'ఆలోచన లక్ష్యం' పేరుతో..

'ఆలోచన లక్ష్యం' పేరుతో అధికారులు, పాలకులు చెరువు కట్టలను అభివృద్ధి చేశారు. కానీ వాటి సంరక్షణ, పర్యవేక్షణ పట్టించుకోకపోవడంతో ఏడాదిలోపే ఇలా కళావిహీనంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పది కాలాలు పాటు పచ్చగా ఉండాలంటే సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ కంపచెట్లు తొలిగించడం, మొక్కలు నాటడం, లైట్లు వెలిగించడం వంటి పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేపకుంట్లలో లింక్ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంజూరు చేయించిన రూ.15లక్షలతో నిర్మించే లింక్ రోడ్డు పనులను గురువారం ప్రారంభమయ్యాయి. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు కోసం మంత్రి గ్రావెల్ రోడ్డును మంజూరు చేయించగా.. వేపకుంట్ల నుంచి వయా చింతగుర్తి ద్వారా చెరువుశిఖం వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు అరివికట్ల ప్రేమ్‌కుమార్, జిల్లా బీసీ సెల్ నాయకులు బండి నాగేశ్వరరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, అరివీకట్ల సుధీర్, రేమల్ల రమేష్ బాబు, చవగాని రామారావు, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పొత్తనబోయిన నాగరాజు, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బానోత్ నాగేంద్ర, గుణగంటి రామారావు, కొట్టే రాజు, రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



పనుల ప్రారంభోత్సవంలో నాయకులు

వినతి.. ఆందోళనలు

కనీస వేతనం ఇవ్వాలి



కూసుమంచి కేజీబీవీలో ఉద్యోగుల నిరసన

ఖమ్మంరూరల్/కూసుమంచి: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, వర్కర్‌లందరికీ పోస్టుకు తగిన వేతనం మంజూరు చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఎన్.నవీన్‌కుమార్, చిలకల శ్రీనివాసరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేట, కూసుమంచిలో గల కేజీబీవీల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో యూటీఎఫ్ ఆధ్వర్యాన ఉద్యోగులు, సిబ్బంది నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కేర్ టేకర్లను నియమించాలని, విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. వీరి సమస్యలపై జనవరి 7న జిల్లా కేంద్రాల్లో మార్చిలో చలోఅసెంబ్లీకి కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘం కార్యదర్శి పణితి మహేష్, ఎస్‌ఓ అజితకుమారి, సుభాషిణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

తిరుమలాయపాలెం: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు పే స్కేల్ వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గమిని అశోక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, పే స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు నెరవేరలేదన్నారు. వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, హైమావతి, ఉపేందర్, వివిధ కాంప్లెక్స్ సీఆర్పీలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పీవీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేల జీవన భృతి ఇవ్వాలని, కొత్త పెన్షన్లతో పాటు పెంచిన పెన్షన్లు చెల్లించాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడగా.. కార్యక్రమంలో ఏఐపీకే ఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, నాయకులు సోమనపల్లి వెంకటేశ్వర్లు, పోతగంటి సతీష్, సీతారాములు, కోతుల కిషన్, పార్వతమ్మ, పులిపలుపుల వెంకటమ్మ, విజయ, గోపగాని మమత, రజిత, వీరయ్య, దారమళ్ల వెంకన్న, గొర్రెపాటి రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. గురువారం జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పేలా 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను మరోసారి గుర్తు చేసుకుంటూ నగరంలో దీక్షదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో పాటు అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పిస్తామని, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రవతి, బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఖమర్, రూరల్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, వీరభద్రం, తెలంగాణ ఉద్యమకారులు వెంకటరమణ, రామ్మూర్తి, సుబ్బారావు, నరేందర్, సతీష్, శీను, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యమానికి ఊపిరిపోసిన దీక్షాదివస్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాలని నేలకొండపల్లిలో జరిగిన సమావేశంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పిలుపునిచ్చారు.

చండీయాగంలో పాల్గొన్న ఎంపీ

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మం అర్బన్: ఖమ్మం మమతా రోడ్డులో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగం నిర్వహణకు ఆయన రూ.3లక్షల విరాళం అందజేశారు. లోక కల్యాణం కోసం యాగం నిర్వహిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. నిర్వాహకులు భాను రవికిరణ్, దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళి దంపతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం కాల్వొడ్డు హనుమాన్ ఆలయం వద్ద రూ.5కే భోజనం సమకూరుస్తున్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఎంపీ పరిశీలించారు. నందమూరి బాలకృష్ణ సేవా సమితి నాయకుడు నల్లమల రంజిత్‌ను అభినందించగా, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రాంమూర్తి, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

జన భోజనాలను..

రఘునాథపాలెం: కుల నిర్మూలన చైతన్యంతో జరుగుతున్న జన భోజనాలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక వ్యవసాయ కూలీ సంఘం నేతలు ఆవుల వెంకటేశ్వర్లు, మలీదు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ప్రజా సాంస్కృతిని ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నగరంలోని బల్లేపల్లి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనక ఉన్న మలీదు జగన్ మామిడి తోటలో జరుగుతున్న జన భోజనాలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.రామయ్య, సీ.వై.పుల్లయ్య, కె.శ్రీనివాస్, బందెల వెంకయ్య, కొల్లేటి నాగేశ్వరరావు, ఎస్‌కె.లాల్మియా, కె.మదర్‌సాహెబ్, రాందాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటి పరిధిలో 4.70 లక్షల క్వింటాళ్ల ధాన్యం, సీసీఐ ద్వారా 78 వేల క్వింటాల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ నెల 30న మహబూబునగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో జరిగే రైతు పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగేశ్వరి, రైతు ప్రతినిధులు పొన్నగాని రాంభాస్కర్, ఠాకూర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌తో తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతుండడంతో గురువారం 3.15 మెగావాట్లు కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈఈ బద్రుపవార్, ఏడీ రమేష్, కూసుమంచి ఏడీ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని శ్రీసిటీ ఎండీ గరికపాటి వెంకట్రావు తండ్రి రాఘవయ్య (95) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా, నాయకులు దండి సురేష్, మిడకంటి చినవెంకటరెడ్డి, బండి జగదీష్ తదితరులు ఉన్నారు.

ప్రజా నాట్యమండలి ప్రతినిధి మృతి

ఖమ్మంగాంధీచౌక్: ప్రజా నాట్యమండలి ప్రతినిధి సాధు ఇజ్జగిరి(64) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈసందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం ప్రకటించారు. వరంగల్ జిల్లా హన్మకొండ భగవత్‌నగర్‌కు చెందిన ఇజ్జగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి ఇజ్జగిరి అంత్యక్రియలకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. నివాళులర్పించిన వారిలో మిమిక్రి సుధాకర్, భోగా గిరి, ఫైర్ రవి, పాగి వెంకన్న, పమ్మి రవి, సతీష్ తదితరులు ఉన్నారు.

అన్నదాన పీఠాన్ని సందర్శించిన ఏసీపీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి నిర్వహిస్తున్న అన్నదాన పీఠాన్ని గురువారం ఏసీపీ రమణమూర్తి దంపతులు సందర్శించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిత్యం 1,000 నుంచి 1,500 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేస్తున్న పీఠం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఠం చైర్మన్ తాండ్ర రాంప్రసాద్ గురుస్వామి, పగడాల కిషోర్, గుత్తా శేఖర్, శీలం గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు అన్నారు. గురువారం పూలే వర్థంతి సందర్భంగా విద్యాలయాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవ్యవసాయం: డీసీఎంఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు



ఖమ్మంసహకారనగర్: యూనివర్సిటీ పీజీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



ఖమ్మంరూరల్: జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): తొలి తెలంగాణ అమరుడు దొడ్డి కొమురయ్య అని ఖమ్మం జిల్లా దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఇండియన్ పీపుల్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ నిర్వహణలో నిర్మిస్తున్న దొడ్డి కొమురయ్య తొలి వాల్ పోస్టర్లను గురువారం రాత్రి ఖమ్మం మయూరిసెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమురయ్య చరిత్రను భావితరాల వారికి స్ఫూర్తినిస్తుందన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సేనాపతి, విజయ్‌కుమార్, సక్రూనాయక్, లక్ష్మీచౌదరి, డాక్టర్ ఖిజరుల్లా, ఉమాయాదవ్, ఝాన్సీ, జయ, జమీల్, యాసిన్, రాము, సామ్రాజ్యం, ఫక్రుద్దిన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్‌కు కృషి

ఖమ్మంవన్‌టౌన్: బాల్య వివాహ రహిత భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ పీఎస్‌ఎస్ హరిప్రసాదరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాల్య వివాహరహిత భారత్ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి ప్రారంభించారన్నారు. బుధవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారని చెప్పారు. తొలుత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఎవరైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే డయల్ 100కు కానీ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద గురువారం కారు – ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఖమ్మం వైపునకు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన వేదవ్యాస్‌కు తీవ్ర గాయాలు కాగా 108లో ఆస్పత్రికి తరలించారు. అలాగే, బస్సులో ఉన్న కొందరికి, కారులోని వారికి సైతం స్వల్ప గాయాలు కాగా, ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

చెకుముకి పోటీల్లో 'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న గీతాంజలి పాఠశాల విద్యార్థులు నయాబజార్ స్కూల్‌లో నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈమేరకు గురువారం ప్రతిభ చూపిన జి.వేదశ్రీ, పి.నవదీప్, పి.చరణ్‌లను పాఠశాల యాజమాన్యం టీవీ అప్పారావు, పద్మ, టి.అరుణ్, ఉపాధ్యాయులు, అభినందించారు.

దీపాదాస్ మున్షీని కలిసిన 'వక్కలగడ్డ'

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): మాదిగ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కోరారు. గురువారం ఈ మేరకు హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దిపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన పేరును సిఫార్సుచేసి మాదిగలకు ఖమ్మం జిల్లాలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

వినోబా కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామం వినోబా కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య, గ్రామీణ పేదల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లూరి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడేళ్ల ప్రత్యక్ష పేదల పోరాటం మంచినీళ్లు, కరెంట్ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. శ్రమజీవులు, బడుగు బలహీన వర్గాలు, పేదల పక్షాన పోరాడుతున్న కమ్యునిస్టు పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే కరెంటు, నీళ్ల కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు కొప్పెర వెంకన్న, రాములు, మాధవరావు, గంగమ్మ, సోమయ్య, లింగమూర్తి, శ్రీనవాస్, పిచ్చమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా?

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల భారీ వర్షాలతో మున్నేటికి వరద వచ్చిన సమయాన నగరంలోని పలుచోట్ల నీరు నిలవకుండా డివైడర్లను తొలగించారు. అనంతరం కొన్నింటిని పునర్నిర్మించినా.. మరికొన్ని చోట్ల వదిలేశారు. కాల్వొడ్డులో డివైడర్ కట్టకపోవడంతో జనం అటూ ఇటు తిరుగుతున్నారు. వాహనదారులకు వీరు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక కవిరాజ్‌నగర్‌లో డివైడర్‌ను నిర్మించినా.. మిగిలిన ఇసుక, మట్టిని రహదారిపైనే వదిలేయడం ప్రమాదకరంగా మారింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కాల్వొడ్డులో పునర్నిర్మించని డివైడర్



కవిరాజ్‌నగర్‌లో రహదారిపై వదిలేసిన ఇసుక, మట్టి